మిసిమి

A Telugu Fortnightly సంపుటి 1 సంచిక 1



25-2-1990

ప్రారంభ సంచిక

మిసిమి

MISIMI

(A Telugu Fortnightly)

సంచిక 1 | 25-2-1990 | సంపుటి 1

విషయసూచిక

1. ఆధునిక తెలుగు సాహిత్యం; అధిక్షేప కావ్యాలు

— డా. రాధాకృష్ణ బూదరాజు

2. సుభాస్ చంద్రబోస్ గెలిస్తే దేశం ఏమయ్యేది?

— డా. ఎన్. ఇన్నయ్య

ఒక రూపాయి

''ఆధునిక తెలుగు సాహిత్యం: అధిక్షేప కావ్యాలు''

— డా॥ బూదరాజు రాధాకృష్ణ

తెలుగు సాహిత్యంలో ఇతర భారతీయ సాహిత్యాల్లో లాగానే హాస్య రస స్ఫోరక మైన అధిక్షేపణ చాలా తక్కువ. కొన్ని ఇతర సమాజాల్లో లాగా హాస్యమయమైన విమర్శకు గాని, చివరికి ఉత్సవాలకు గాని మన సమాజంలో స్థానం లేదు. మనం హాస్యాది దైవతమని భావించే వినాయకుడి పండుగలో కూడా సరదాల మీద దృష్టి తగ్గిపోతున్నది మనకు. ప్రాచీన రోమన్ సమాజంలో ''Festival of Saturnalia'' అనే పండుగ జోరుగా జరిగేది. ఆ సమయంలో రాజుల నుంచి సామాన్యుల దాకా అందరూ నవ్వుతూ, వెక్కిరిస్తూ, వేళాకోళం చేస్తూ విమర్శిస్తూ కాలం దొర్లించే వాళ్లు. మధ్యయుగాల్లో అనేక యూరోపియన్ దేశాల్లో 'Feast of Fools' అనే వినోదాత్మకమైన పండుగ జరిగేది. బహిరంగ విమర్శలకూ అధిక్షేపాలకూ అవకాశమిచ్చే ''Fasching'' అనే సారస్వత లక్షణంగల పండగ ఆస్ట్రియాలో జరిగేది. నేటికీ ఆఫ్రికా ఖండంలోని 'అషాంతి' దేశంలో ప్రతి శుక్రవారం నాడూ ప్రజలు గుమిగూడి రాజును అతని సమక్షంలోనే నానా విధాలుగా ఆక్షేపిస్తుంటారు. ఆ రోజు ఏమన్నా చెల్లుతుంది. మరునాటి నుంచీ అలా చేయటం నిషిద్ధం-ప్రమాదకరం. ఇలాంటి సంప్రదాయాలు మనకు లేవు. ఉంటే-అవి మన సాహిత్యంలో ప్రతిబింబించేవి.

ఆధునిక సాహిత్యంలో-వీరేశలింగ యుగం నుంచీ పెద్ద సంఖ్యలో కాకపోయినా రకరకాల అధిక్షేప కావ్యాలు వెలువడ్డాయి. వాటినే ఇప్పుడు చర్చిద్దాం. ఈ రకం సాహిత్యం పద్యం, గేయం, వచనం లాంటి అనేక రూపాల్లో వచ్చింది. స్వభావరీత్యా వింగడిస్తే తెలుగులోని అధిక్షేప కావ్యాలను ప్రధానంగా మూడు రకాలని చెప్పవచ్చు- సాహిత్యక, సామాజిక రాజకీయ కావ్యాలని వీరేశలింగం గారే ఆధునిక యుగంలో ఆక్షేపకావ్యాలకు శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. ఆయన నాటికి వెర్రితలలు వేసిన ప్రబంధ ప్రక్రియనూ, అందులోని గతానుగతిక రచనా ధోరణినీ, అధిక్షేపిస్తూ, వీరేశలింగం రాసింది 'అభాగ్యోపాఖ్యానం' అనే కావ్యం. ప్రబంధాల్లో సాధారణంగా ఉదాత్త నాయికా నాయకులూ వారి శృంగార క్రీడలూ వర్ణితాలు. వీరేశలింగం గారి కథానాయికా నాయకులు అనుదాత్తులు. ''అతనికి పొట్ట గోసినను అక్షరమొక్కటి లేదు, కాగడతో వెతకిన తెల్విలేదు'' మొదలుగా నాయకుణ్ణి వర్ణిస్తాడు. ప్రబంధకవుల-ముఖ్యంగా క్షీణయుగ ప్రబంధ కవుల-శబ్దాడంబర శుష్క- వర్ణనలకు ప్రతిగా ''డాయను భీతి బొంద మగడాయను, తల్పులు తీయమేని రండాయను, పల్కవేమి చెవుడాయను'' ఇత్యాది దుర్భర ప్రసంగాలు కూడా అందులో ఉన్నాయి. ప్రబంధ ప్రక్రియా సమిష్టిని అధిక్షేపించటమే ప్రధానంగా పెట్టుకొని ఆయన ''ఆభాగ్యోపాఖ్యానం'' రాశాడు. వచన గ్రంథాలనూ, నాటకాలనూ కూడా కావ్యాలంటే చాలమంది ఒప్పుకోరు. కానీ ''రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్'' అనే పండిత రాయల నిర్వచనం ప్రకారమయితే వీరేశలింగం గారి ప్రహసనాలూ, తిర్యగ్విద్యన్మహాసభ వంటి రూపకాలూ అధిక్షేప కావ్యాలనే చెప్పవచ్చు.

ఈ నిర్వచనం ప్రకారం గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' ఆధునిక సాహిత్యానికి మకుటాయమానమైన అధిక్షేప

కావ్యమనాలి. సమాజంలోని వైరుధ్యాలను, లోపాలను, వంచనలను, అంతకన్నా సుకుమారంగా సుందరంగా సర్వాగీణంగా అధిక్షేపించిన మరో గ్రంథం మనకు లేదంటే అతిశయోక్తి కాదు. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి 'గణపతి', మొక్కపాటి నరసింహశాస్త్రిగారి ''బారిష్టర్ పార్వతీశం'' వంటివి కావ్యాలంటే ఒప్పుకోమనీ, అధిక్షేప గ్రంథాలంటే సరిపెట్టుకుంటామనీ అనే వాళ్లూ ఉన్నారు.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారి ''సాక్షి'' వ్యాసాలు, 'కంఠాభరణం' వంటి నాటకాలు మన సమాజ సాహిత్యాలను రెంటినీ అధిక్షేపించే రచనలు.

పద్య రచనల్నే కావ్యాలుగా పరిగణించినట్లయితే త్రిపురనేని రామస్వామి చౌదరి గారి ''సూతపురాణం'' అధిక్షేప పురాణం. తిరుపతి వేంకటకవుల 'గీరతం' వ్యక్తి దూషణ పూర్వకమైనా అధిక్షేప కావ్యమే. ఆ తరంలో కొప్పరపు వారూ, రామకృష్ణ కవులూ, తిరుపతి వేంకటకవులూ ఒకరొకరు అధిక్షేపిస్తూ బండ్లకొద్ది పద్యాలూ పుస్తకాలూ రాసుకున్నారు. అయితే వాటి ప్రయోజనం పరిమితం. 'రావణదమ్మీయం-ఉరఫ్-లంకా విజయం' పద్ధతిలో నిర్దూమధామంగా దూషించిన కావ్యాలవి. ఆంధ్రరత్న చుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి చాటు పద్యాలు అధిక్షేపకాలు. బహుశా రాజకీయలకు కూడా అన్వయించి అధిక్షేప ప్రక్రియను విస్తరించిన మొదటి తెలుగు కవి ఆయనే ఏమో. సుప్రసిద్ధ రాజకీయ నాయకులందర్నీ వెక్కిరించి వేళాకోళమాడిన ఆంధ్రరత్న 'గోపాల కిష్టాయి కొక్కిరాయి'' అని ఆత్మనింద చేసుకొని, తన అధిక్షేపణల తీవ్రతను ఒక్కసారిగా తగ్గించి వేశారు. ఎంకి పాటలు మీద ఆయన రాసిన అధిక్షేపణ గేయం, గేయ ప్రక్రియలో తొలి అధిక్షేపణమేమో.

శతక వాఙ్మయంలో అనూచానంగా అధిక్షేపం కనిపిస్తుంది. వేమన పద్యాల్లో రకరకాల అధిక్షేపాలున్నాయి. ఆధునికులు చాలామంది ఇంకా శతకాలు రాస్తున్నారు; వాటిలో సామాజిక, రాజకీయ వ్యవస్థల మీద అంతో ఇంతో అధిక్షేపం కనిపించక పోలేదు. భావ కవిత్వం బాగా పేరు సంపాదించి స్థిరపడిన తర్వాత ఉత్తమ భావ కవితకు, నిదర్శనగా ఉన్న దేవుల పల్లి కృష్ణశాస్త్రిగారి 'కృష్ణ పక్షాన్ని' అధిక్షేపిస్తూ అనంతపంతుల రామలింగస్వామి గారి 'శుక్లపక్షం' వెలువడి కొంత సంచలనం తెచ్చింది. కానీ నిలవలేక పోయింది.

అధిక్షేపమనగానే ఈ శతాబ్దంలో గుర్తుకు వచ్చే రెండు పేర్లలో మొదటిది జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారిది. చమత్కారం, వెక్కిరింత సమపాళ్ళలో నడిపిన ఆ మహాత్ముడు తన పేరును కూడా రకరకాలుగా రాసుకున్నాడు. జరుక్, జరుక్ శాస్త్రి, రుక్కు-టేశ్వర్, మిణీశాస్త్రి వగైరాలుగా. ఆయన విశ్వనాథ సత్యనారాయణ గారిని అధిక్షేపిస్తూ ''పాషాణపాక ప్రభూ'' అని ముగించిన పద్యం చాల ప్రాచుర్యం పొందింది. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు బతికి ఉండగానే అవధాన ప్రదర్శనలు దేశంలో మార్మోగిపోతుండగానే, జరుక్ శాస్త్రి తిరుపతి వేంకటకవుల్నీ, అవధాన విద్యనూ అధిక్షేపిస్తూ చెప్పిన గేయం తమాషా అయింది.

''లలాటన కుంకుమాగ్ని
బుజంమీద మబ్బు దుబ్బు
కాళ్ళకింద కిర్రుచెప్పు
అంగోస్త్రం, పాడుంకాయ
వ్యవధి లేని అవధానం
వెళ్ళిపోయిందెళ్ళిపోయింది.''

అని జరుక్‌శాస్త్రి వర్ణించాడు. వ్యక్తికీ విషయానికీ ముడిపెట్టి మరీ రాశాడు.

భిన్నరూపాల సాహిత్యంలో భావ కవి

త్వాన్ని, అవధాన కవిత్వాన్ని మరిచి పోకుండా రాజకీయ, సామాజిక విషయా లను కూడా చేర్చుకుంటూ అధిక్షేప సాహిత్యం సృష్టించిన వాడు మాచిరాజు దేవీ ప్రసాద్. దేవులపల్లి కృష్ణశాస్త్రి భావ, ప్రణయ కవితలకు పోటీగా 'తాత విరహం' వంటి కావ్యాలు రాశాడు. విశ్వ నాథ సత్యనారాయణగారి సంప్రదాయ వాదాన్ని అధికేపిస్తూ ''అచ్చుత్తించు శ్రీప్రెస్సులో శ్రీ అచ్చుల్ సరిపోయి ఏడ్చినవిటోయ్ శ్రీ విశ్వనాథేశ్వరా?'' అని ప్రశ్నించాడు. శ్రీశ్రీ ''మహాప్ర స్థాన'' గేయాలను అధిక్షేపిస్తూ ''రహదార్ల చరిత్ర సమస్తం, పరపీడాపరాయణత్వ మన్నాడు. ప్రపంచయుద్ధ కాలం నాటి కాగితం కరువును, అప్పటి పాదుపు ఉద్య మాన్ని అధిక్షేపిస్తూ, ఉత్తర ప్రత్యుత్తర రూపంలో రెండు వచన గ్రంథాలనూ, ఓ పద్య రచననూ చేసి ఇబ్బంది పాలైనాడు.

''కాగితం ఖర్చు చేయబోకండి మీరు
కాగితం ఖర్చు చేయనీయకండి అనుచు
విశ్వరూపాల వంద వేయి కోట్లు
వాలు పోస్టరులంటించె వాడవాడ''

అని అప్పటి ప్రత్యేకాధికారి చేష్టలు వెక్కిరించి

''ఉన్న భార్య, దూరాన ఇరుక్కుపోయె!
ప్రణయ లేఖమ్మ్మ వ్రాయ పత్రమ్మ్మ లేదు!
ప్రణయ కావ్యమ్మ్మ వ్రాయ పత్రాలు లేవు''

అని బాధ పడ్డాడు. అంత కరువు లోనూ కవులు రచనా కండూతిని వదు ల్చుకోలేక పోయారని అతడి అధిక్షేపం.

శ్రీశ్రీ 'సిరిసిరి మువ్వ శతకం', 'రుక్కుటేశ్వర శతకం' వంటివి అధికేప కావ్యాలే. ప్రాచీన నీతి పద్యాల ధోరణిని అధిక్షేపిస్తూ శ్రీశ్రీ

''పిల్లులు పిల్లల చెట్టును
నల్లును ద్రావెడి కతాన నల్లి అనబడెన్
అల్లుడు దశమోగ్రహములు
వెల్లుల్లికి తీపిలేదు విశ్వనున జరూ!''

అంటూ శ్రీశ్రీ అధిక్షేపించాడు. ఈ ధోరణిలోనే ఆరుద్ర అధిక్షేపిస్తూ గేయాలు రాశాడు. ఆయన మత, సామా జిక స్థితిగతులను కూడా అధిక్షేపిస్తూ

''ఏకపత్నీ వ్రతము
ఎలుగెత్తి మన మతము
వేల్పు భార్యలు శతము
ఓ కూనల మాశ్రీ!.....కాలవశమున
మారి
చాల ముడుపులు కోరి
దేవుడే వ్యాపారి
ఓ కూనలమ్మా!'' ఇత్యాదిగా కూన లమ్మ పదాలను అధిక్షేపకంగా రాశాడు.

రాజకీయ సిద్ధాంతాలు ప్రధానంగా సామాజిక రుగ్మతలను అధిక్షేపిస్తూ రాసిన వాళ్లు సుప్రసిద్ధులు గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తులు. మల్లారెడ్డిగారి 'శంఖారావం'లో ''అడగని వరమిచ్చు వేల్పులంటూ ఉన్నారురా?'' అని గురువ డిగితే శిష్యుడు చెప్పిన సమాధానం అధిక్షే పంగా ఉంటుంది. ప్రాచీన గురుశిష్య సంవాద సంప్రదాయ ధోరణిలో ఇది రాజ కీయాధిక్షేపం చేయటం. అలాగే ''ఇద్దరు పండితులమధ్య ఒద్దిక లెట్లుండురా?'' అనే గురువుగారి ప్రశ్నకు శిష్యుడి సమా ధానం ''అగ్గిమీద గుగ్గిలమ్ము! నిగ్గుదేరి నట్లు గురూ!'' అనేది రాంభట్ల కృష్ణమూ ర్తిగారి ''శశవిషాణం'' వంటి కావ్యాల్లోని సమస్త విషయాలూ రాజకీయ అధిక్షేపాలే. దసరా పద్యాలుకు రాసిన పేరడీల్లో కూడా అది ప్రతిఫలిస్తుంది.

''అయ్య వార్లకు చాలు అర్థజీతాలు
పిల్లవాళ్ళకు చాలు పూట పాఠాలు'' మొద లుగా నడుస్తుంది అధిక్షేపం. దిగంబర కవులవంటి తీవ్రవాదులు సాగించిన రాజ

కీయ సాహిత్యక అధిక్షేపం చాలా సద
ర్భాల్లో సభాసాధువు కాదు. కానీ అధిక్షే
పమే.

తెలుగువాళ్లకు కోపతాపాలుగాని, ప్రేమాభిమానాలుగాని కొంచెం ముదురు. పాకంలోనే ఉండటం వల్ల బహిరంగ ప్రదేశాల్లో ఇప్పటి సామాజిక ధర్మం ప్రకారం ఉదాహరించడానికి వీలులేని అధిక్షేప కావ్యాలు చాలా ఉన్నాయి. ఒక విధంగా అవి తిట్టు కవితగా మారాయనిపిస్తుంది. సాక్షి వ్యాసాల్లోని అనేకాధిక్షేపాలను ఈ కాలంలో ప్రస్తావించటం కష్టం. దాసు శ్రీరాములుగారి ''తెలుగునాడు'' వంటి అధిక్షేప కావ్యాల్లో సమకాలంలో కులాల, శాఖల, ఉపశాఖల మీద నేటి సమాజ న్యాయం ప్రకారం, న్యాయశాస్త్రం ప్రకారం రాయడానికి గాని, బహిరంగ స్థలాల్లో చదవడానికి గాని వీలులేని కుల మత దూషణలున్నాయి. ప్రాచీనసాహిత్యంలోనే కాక సమకాలిక సాహిత్యాలలో కూడా ఇలాంటి అసహన ప్రసంగాలుండటం మన దురదృష్టం.

మానవజాతి ఉన్నంత కాలం దానిలో మంచితోబాటు చెడుకూడా ఉంటుంది. చెడును తీవ్రంగా ప్రతిఘటించటం ఒక ఎత్తయితే, వెక్కిరించి ఎత్తి చూపడం మరో పద్ధతి. మన ఆచార వ్యవహారాల్లో, మన సంప్రదాయాల్లో, రాజకీయ వ్యవస్థలో, సాహిత్యంలో ఉన్నలోపాలను అధిక్షేపించే సాహిత్యం తెలుగులోనే కాక మొత్తం భారతీయ సాహిత్యంలోనే చాలా తక్కువ నిపిస్తుంది. భగవద్గీత వంటి పవిత్ర గ్రంథాన్ని అక్షరాక్షరం అధికేపిస్తూ ''ఉత్తర గీతలు'' రాసుకున్న జాతిలో, పాణినీయం వంటి సూక్ష్మశాస్త్ర ప్రసంగాలకు అధిక్షేపాలు పరంపరగా చెప్పుకున్న జాతిలో, విమర్శను భరించలేని, సహించలేని సౌకుమార్యం ప్రబలి పోవటమే ఆశ్చర్యకరం. అంతేకాదు హాస్యం అశ్లీలమయితే గాని రాణించదని, అధిక్షేపణ ఒక మతానో్న, కులానో్న, రాజకీయ పక్షానో్న దూషించేవిగానే ఉండాలని చాలమంది నమ్ముతున్నట్లుంది. సంస్కృతంలోలాగా అన్యాపదేశ కావ్యాలు ప్రత్యేక ప్రక్రియగా నేటి తెలుగులో కూడా రాకపోవడం విచారకరం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కరుణ ప్రధానంగా అధిక్షేపించిన మహాకవి జాషువా. ప్రత్యేకించి అధిక్షేపక ఖండకావ్యాలు రాయకపోయినా, రాసిన వాటిలో అధిక్షేపాన్ని కరుణామయంగా చొప్పించిన వాడు జాషువాయే ననిపిస్తుంది. ఆ అధిపంలో మెత్తని మందలింపేగాని ద్వేషం లేదు. తాను గాంధేయుడై తన పక్షం వాళ్ళే అధికారంలో ఉన్నా ఆయన సుకుమారంగా అధిక్షేపించాడు. గాంధీజీ మరణానంతరం మన సమాజంలో నిలిచిపోయిన యథార్థ్యాన్ని అధిక్షేపిస్తూ జాషువా

''కలకల నవ్వేడు తాతయ్య
శిలయై, కలయై అనంత శిల్పంబునకున్
బలమిచ్చి మాయమయ్యెన్
కులమత తత్వములు పుంజుకొని తలయెత్తెన్''

అని వాపోవటంతో మన సమాజంలో మాటకూ, చేతకూ పొంతన లేకపోవటాన్ని ఆయన అధిక్షేపించాడు.

మానవ సమాజంలోని అత్యధిక సంఖ్యాకులు దారిద్ర్యరేఖకు దిగువన ఉంటున్నారు. వారికి కావలసింది తిండీ, గుడ్డా, తలదాచుకునేందుకు కాస్త జాగా శ్రీకృష్ణ దేవరాయల కాలంలో రత్నాలను వీధుల్లో రాసులుగాపోసి అమ్ముకునే వాళ్లమని శాసనాలూ, కైఫియత్తులూ, ప్రబంధ వర్ణనలూ ఉటంకిస్తూ మన ప్రాచీన వైభవాన్ని కళ్ళకు కట్టేటట్లు వర్ణించినా

సామాన్య ప్రజలకు కడుపు నిండడం టూడు జాషువా. అందుకే

''రేయిబవలు భారతీయసంస్కృతి పేర
గండశిలలు చూపి కథలు చెప్పి
పేదవాని కడుపులోగల చిచ్చును,
గడపగలవె నీవు గగనవాణిని''

అని ప్రశ్నిస్తాడు. ఇటువంటి అదికే పాలు వెతికితే అనేకేతర కావ్యాల్లో కనిపి స్తాయి. కానీ అవి మన సాహిత్యంలో అధిక్షేప కావ్యాలకున్న కొరతను తొల గించ లేవు.

ప్రాచీన సంప్రదాయం ప్రకారం హాస్యం మానవీయం కాదు. శుద్ధహాస్యం అంతక న్నాను. అధిక్షేపం హాస్యప్రధాన మనుకోన క్కర లేదు. దూషణ ప్రధానమనీ భావిం చనక్కర లేదు. వాస్తవ పరిస్థితి చిత్రణ ద్వారా కూడా అధిక్షేపాన్ని సాధించ వచ్చు. కడుపులోని బాధను కన్నీళ్ళతో కడుక్కోడానికి అధిక్షేప సాహిత్యం అక్ష రాలా ఉపయోగపడుతుంది. ఈ శతాబ్ది రంభంలో ప్రాచీన ధోరణిలోనే పుల్లకవి అనే చాటు కవి చేసిన అధిక్షేపం వినండి.

''కోణంగి నాట్యములో కోతులాడించగా
ఊరబందులు తలలూపినట్లు
గూబకూతలు విని గువ్వలు తలలూచి
పోయి కాకుల వద్ద పొగడినట్లు
కాలువదరి నుండి కప్ప లంకించగా
ఎండ్రకాయలు తలెత్తినట్లు
ఎనుబోతు బిరుదులు మనుబోతు పొగడంగ
మేలు మేలని గొర్రె మెచ్చినట్లు
ఓగు ధగిడీలు తమలోన నొకరి నొకరు
మెచ్చుకొను చుందురెటు వంటి పిచ్చి తనమొ!''

అని విస్తుపోతాడు. ఈవిధంగా చెట్టు మీదా పిట్టమీదా పెట్టి అధిక్షేపించే సంప్ర దాయం ఉండేది. కందుకూరి వీరేశ లింగం గారి ''తిర్యగ్విద్మన్మహాసభ'' లో అడివిలోని పశుపక్షులు మన సమాజం లోని అవకతవకలను ఇలాగే చర్చిస్తాయి. ఈరకమైన అధిక్షేప కావ్యాలు మనకు చాలా తక్కువ. ఇక ముందు వస్తాయని ఆశిద్దాం.

వాస్తవాల పరిశోధనా వ్యాసం

సుభాస్ చంద్రబోసు గెలిస్తే దేశం ఏమయ్యేది?

— డా॥ ఎన్.ఇన్నయ్య

సుభాస్ చంద్రబోసు గురించి మనదేశంలో కావలసిన్ని కట్టుకథలు ప్రచారంలో వున్నాయి. హిమాలయాలలో యోగిగా వున్నాడనీ, రష్యాలో రహస్యంగా సంచరిస్తున్నాడని, తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నాడనియిలా పుక్కిటి గాథలు ఎన్నో వ్యాపించాయి.

మనకు భద్రాజీయం బాగా అలవాటు. ముఖం వాచేటట్లు పొగడటం ఆనవాయితీ. వీరారాధన కూడా జాస్తిగానే వున్నది. దీనికి భిన్నంగా తెగనాడటమూ అదే మోతాదులో వుంటుంది. ఈ అతి వృష్టి, అనావృష్టి వలన, నిశిత పరిశీలన, శాస్త్రీయ దృక్పథం బాగాదెబ్బతిన్నాయి. పరిశోధన, పరిశీలన బాగా కుంటుపడింది. బోసు విషయంలో సరిగ్గా యిదే జరిగింది.

అయితే ఇటీవల విదేశాలలో బోసు పాత్ర గురించి అధారాలతో కూడిన సమాచారిన్ని పరిశోధించి వెలువడిన కొన్ని సిద్ధాంత గ్రంథాలు మనకెంతో ఉపకరిస్తున్నాయి.

సుభాష్ చంద్రబోసు గురించి ముందు వాస్తవాలు తెలుసుకొందాము. నిర్ణయాలు, వ్యక్తిత్వ విశ్లేషణ పాఠకులే ఒక స్వరూపంలో పెట్టుకోగలరు. ఆదృష్టితో కొత్తగా తెలిసిన సమాచారాన్ని, పరిశోధనాత్మక వివరాలను యిక్కడ పొందుపరుస్తున్నాను.

బోసు సాహస జీవితం

మన దేశంలో బ్రిటీష్ పాలకులను పారద్రోలటానికి జర్మనీ-రష్యా సహాయం స్వీకరించాలనే అభిప్రాయం బోసుకు చిరకాలంగా వుండేది. ఏమార్గాన్ని అనుసరించి అయినా సరే, స్వాతంత్ర్య లక్ష్యాన్ని సాధించాలనేది బోసు ఆకాంక్ష. బ్రిటీష్ వ్యతిరేకతను బోసు స్పష్టంగా తరచు ఆవేశంగా వ్యక్తం చేసేవారు. ఆయన 1921 నుండి అరెస్టులు అవుతూనే వచ్చారు. మొత్తం 11 పర్యాయాలు బ్రిటీష్‌వారి నిర్బందానికి గురైనారు. బోసు ఐ.సి.యస్.కు రాజీనామాచేసి కాంగ్రెసులో చేరారు. 27 సంవత్సరాల వయస్సులో కలకత్తా మేయరుగా ఎన్నికయ్యారు. బెంగాల్ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా, అఖిల భారత కార్మిక సంఘాధ్యక్షుడుగా పనిచేశారు.

1933లో అనారోగ్య కారణంగా నిర్బందంలోవున్న బోసును బ్రిటీష్ పాలకులు విడుదలచేస్తూ విదేశాలకు వెళ్లిపోవాలని ఆంక్షపెట్టారు. ఆప్రకారం యూరపు వెళ్లిన బోసు 1934 డిసెంబర్‌లో మరణశయ్యపై వున్న తండ్రిని చూడటానికి స్వదేశం వచ్చారు. మళ్లీ 1937 నవంబరులో ఆయనను కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు.

ఫాసిజానికి-సోషలిజానికి పొత్తు సాధ్యమని నమ్మిన బోసు సోవియట్ రష్యాకు, ఇటలీకి ఒడంబడిక కుదురుతుందన్నారు.

1933 జూలైలో బోసు బెర్లిన్ వెళ్లినప్పుడు ఇండోజర్మన్ సంఘంవారు ఆయనను ఆహ్వానించారు. నాజీలతో పెద్దనాయకులెవరూ బోసును కలియలేదు. ఆహ్వానించలేదు. చిన్న చిన్న నాజీ అధికా

రులు బోసును కలిసినా బ్రిటీష్‌వారికీ, ఇండియాకుగల వైరుధ్యంలో తాము తటస్తంగా వుంటామన్నారు. ఇందుకు భిన్నంగా ఇటలీలో ముస్సోలినీ అనేక పర్యాయాలు బోసును ఆహ్వానించి మాట్లాడారు. అలాగే ఆస్ట్రియా, పోలెండ్, చెకోస్లోవేకియాలో ప్రముఖులను బోసు కలియగలిగారు.

ఇండియన్ స్ట్రగుల్

1934 మేలో ఇండో-సెంట్రల్ యూరప్ సొసైటీని వియన్నాలో స్థాపించిన బోసు బెర్లిన్‌లో భారతీయ విద్యార్థులను సంఘటిత పరిచాడు. వియన్నాలో ''ది ఇండియన్ స్ట్రగుల్'' అనే గ్రంథాన్ని ఇండియాకు రానివ్వకుండా వీలైతే ప్రచురణ జరగకుండా ఆపాలని బ్రిటీష్‌వారు ప్రయత్నించారు. 1935లో లండన్‌లో దీనిని ప్రచురించగా, 1842లో ఇటలీలో ప్రచురితమైంది.

జర్మనీ నాజీలు కేవలం యూదులనే అవమానించారనుకోవద్దు. అక్కడ వున్న భారతీయులకు కావలసినన్ని అవమానాలు జరిగాయి నాజీ పత్రికలలో ఇండియన్లపై అసభ్యంగా వ్రాసారు. గాంధీపై గోరింగ్ తీవ్ర దాడి చేశాడు. ఇండియాలో తెల్లవారి పాలన మెచ్చుకొంటూ జాతి తక్కువ ఇండియన్లనే విమర్శతో కూడిన సినిమాలు చూపారు.

భారతీయుల అవమానాలకు బోసు అభ్యంతరం

ఇదంతా కళ్లారా చూచిన బోసు అభ్యంతరం పెడుతూ ఉత్తరాలు వ్రాస్తే, జర్మనీ అధికారులు సమాధానం యివ్వలేదు. అసలు ఖాతరు చేయలేదు. నిస్పృహతో 1936 మార్చి 25న ఇండియాకు తిరగిరాబోతూ బోసు తన ఆశలన్నీ అడియాసలైనాయని, బ్రిటన్ దువ్వడానికి గాను జర్మనీ భారతీయులపై దాడిచేస్తుందన్నారు. 1933లో జర్మనీపై వుంచిన ఆశలు తొలగిపోయాయని సంకుచితంగా, స్వార్థపూరితంగా, పొగరుబోతుగా నాజీ జర్మనీ తలెత్తిందని బోసు అన్నారు.

1937 మళ్లీ జర్మనీ వెళ్లిన బోసు భారతీయులు జర్మన్‌లు పెళ్ళిళ్ళు చేసుకోవడానికి పెట్టిన ఆంక్ష తొలగించాలని, గాంధీపై గోరింగ్ దాడిని, ఇండియాపై హిట్లరు దాడిని రికార్డులనుండి తొలగించాలని కోరారు. రోజన్‌బర్గ్ తన గ్రంథంలో ఇండియాపై చేసిన వ్యతిరేక ప్రకటనలు ఉపసంహరించాలనికోరారు.

విదేశాలలో అప్పటికే ప్రజలు నెహ్రూ, బోసుల గురించి బాగా విని వున్నారు. ఫాసిస్టు మద్దతుకై బోసు ప్రయత్నిస్తున్నాడని అమెరికా పత్రికలు వ్రాశాయి. జర్మనీ, ఇటలీ మద్దతుకై బోసు కృషిచేస్తున్నాడని కూడా జగమెరిగిన సత్యమే. అయినా హిట్లర్ ఇండియాకు అనుకూలంగా లేడు. బోసుకు సమాధానం యివ్వలేదు. ఇంగ్లండ్ కు వ్యతిరేకంగా జర్మనీ మారిన తరువాతకూడ బోసును హిట్లర్ గౌరవించలేదు. ఇండియాలో మాత్రం తెల్లవారి పాలన తొలగిపోరాదనీ, బ్రిటీష్ వారు వైదొలగితే సోవియట్ రష్యా పెత్తనం వస్తుందని హిట్లర్ ఉద్దేశ్యం.

బోసు కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుగా వుండగా జర్మనీ జమిందారు డా. హజల్ మర్‌షాట్ 1939 ఏప్రియల్ 10న బొంబాయి చేరారు. జర్మనీపై ఆశపోని బోసు రహస్యంగా 1938 డిసెంబరు 22న బొంబాయిలో యిద్దరు జర్మన్లను కలిశారు. డా. వుల్ఫ్‌స్టెగి, డా. అర్చన్ అనే వీరిరువురినీ బోసుతో కలపటానికి ఎన్.జి. గన్‌పూల్ తోడ్పడ్డారు. తన పాత కోర్కెలన్నీ బోసువారితో ఏకరువు పెట్టారు. ''ది డైలీ మెయిల్''లో ప్రచురి

తమైన గాంధీపై గోరింగ్ దాడి, మైన్‌కాంపులో హిట్లర్ ఇండియాపై వ్రాసిన వ్రాతలు, రోజన్‌బర్గ్ రచనలో కొన్ని భాగాలు, జర్మన్ పత్రికలలో భారతీయుల్ని కించపరచే వ్రాతలు ఉపసంహరించాలన్నారు. ఇండియా నుంచి జర్మనీకి వెళ్లిన ప్రముఖులను తనతోసహా అధికారులు ఆహ్వానించక పోవటంపట్ల నిరసన తెలియపరచారు.

బోసు అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని బ్రిటన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీని వాడటానికి జర్మనీతో ఇండియాకు సత్సంబంధాలు ఏర్పడటానికి కృషి చెయ్యాలని డా.అర్చన్ వ్రాశారు. కాని జర్మనీ ఈవిషయం పట్టించుకోకపోగా, బ్రిటీష్ సామ్రాజ్య ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకున్నటవుతుందేమోనన్నారు. ఏమైనా యుద్ధారంభం జర్మన్లు తమకు అనుకూలంగా వాడుకొనే ప్రయత్నం చేయలేదు. జర్మన్-ఇండియాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. జర్మనీ ధోరణిని జాతి అహంకారాన్ని కాంగ్రెస్‌పార్టీ గాంధీ నాయకత్వాన నెహ్రూ ఆధ్వర్యాన ఖండిస్తూ పోయారు. అలాంటి జర్మనీపై బోసుకు ఏనాడూ ఆశలు విడిపోలేదు.

గాంధీ వ్యతిరేకత

కాంగ్రెస్‌పార్టీలో గాంధీ అనుసరించే అహింసాయుత సత్యాగ్రహాలు బోసుకు నచ్చలేదు. బ్రిటీష్‌వారిపై ప్రత్యేక చర్యకు దిగాలని, ప్రపంచంలో బ్రిటీష్‌వారు ఎదుర్కొంటున్న చిక్కుల ఆధారంగా వారిని చావుదెబ్బకొట్టాలని బోసు ఆకాంక్ష. కాంగ్రెస్‌నుండి బయటకుపోయి ఫార్వర్డ్ బ్లాక్ స్థాపించిన బోసు, వామపక్షాల ఐక్య సంఘటనకు విఫలప్రయత్నం చేశాడు. సోవియట్ రష్యా, జర్మనీల సహాయం తీసుకోవాలనే తలంపు మాత్రం ఆయన్ని వెంటాడుతూనే వున్నది.

రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ గెలుపుచూచి బోసు చాలా సంతోషించాడు. యుద్ధంలో బ్రిటన్ ఓడిపోతుందనీ, ఇదే అదనుగా ఇండియాలో బ్రిటీష్ వారిని దెబ్బ తీయాలని బోసు ఉద్దేశ్యం. గాంధీ కలిసి రాలేదు. 1939 అక్టోబరులో చైనా వెళ్లటానికి పాస్‌పోర్టుకై బోసు ధరఖాస్తు పెట్టారు. బెంగాల్ ప్రభుత్వం ఒప్పుకున్నది. కాని కేంద్రప్రభుత్వం నిరాకరించింది. ఇండియాలో వుంటే ఒక కన్నేసి వుంచవచ్చనీ, చైనా పోనిస్తే ఖచ్చితంగా రష్యాతో బోసు సంబంధం పెట్టుకొంటాడని బ్రిటీష్ గూఢచారు భావించారు.

1940 జులై 2న సుబాష్ చంద్రబోసును 11వ పర్యాయం నిర్బంధించారు. బ్రిటీష్ వ్యతిరేక ప్రదర్శన కలకత్తాలో జరుపుతుండగా అరెస్టు చేశారు. 1940 నవంబరు 26న బెంగాల్ గవర్నర్‌కు బోసు ఒక ఉత్తరం వ్రాస్తూ తాను జైలులో నిరాహారదీక్ష ప్రారంభిస్తునట్లు పేర్కొన్నారు. జైల్లో చనిపోతే పెద్దగొడవ అవుతుందని, బ్రిటీష్ అధికారులు భయపడి బోసును 6 రోజుల దీక్ష అనంతరం విడుదలచేసి, 38 బల్డిన్ రోడ్డులోని స్వగృహంలోనే ఉండమన్నారు. దుస్తులలో వున్న పోలీసులను కాపలా పెట్టలేదు.

బోసు తప్పించుకోవటం

1941 జనవరి 17న ముస్లిం అస్యూరెన్సు ఏజెంటుగా, మహమ్మద్ జియావుద్దీన్ పేరిట బోసు యింట్లో నుంచి తప్పించుకుని వెళ్లిపోయాడు. కలకత్తా బయట రైలుఎక్కి రెండురోజులకు పెషావర్ చేరారు. పది రోజుల తరువాతగాని పోలీసులకు ఈవిషయం తెలియలేదు.

జపాన్ వెళ్లివుండవచ్చు అని పోలీసులు భావించారు. దేశమంతటా బోసు తప్పించుకున్న వార్త పెద్ద కలవరాన్ని రేకెత్తించింది.

పెషావర్‌లో భగత్ రాంతర్వార్ వురఫ్ రహమత్‌ఖాన్ అనే పటాన్‌గా 1941 జనవరి 22న బయలుదేరి బోసు కాబూల్ చేరుకున్నారు. తప్పించుకొన్న తరువాత కాబూల్ చేరిన నాడు కలకత్తా పోలీసులకు తప్పించుకున్న వార్త తెలిసింది. పెషావర్‌లో వుండగా అబద్‌ఖాన్ అనే వ్యక్తి బోసుకు ఆశ్రయం యిచ్చాడు.

కాబూల్‌కు వెళ్లగానే బోసు తన సహాజ ధోరణిలో సోవియట్ రాయభార కార్యాలయం ద్వారా రష్యా వాణిజ్య మిషన్‌తో తన రష్యా ప్రయాణం విషయమై ప్రయత్నించి విఫలుడయ్యాడు. కాబూలులో ఉత్తమచంద్ అనే వర్తకుడు బోసుకు రక్షణ కల్పించాడు. తరువాత జర్మనీ, ఇటలీ రాయబార కార్యాలయాలలో బోసు తన ప్రయాణం సంగతి ప్రస్తావించారు.

మాస్కో నిరాదరణ

మాస్కోలోని జర్మనీ రాయబారి 1941 మార్చి 3న ఒక కేబుల్ పంపిస్తూ జర్మనీకి పోతూ దారిలో మాస్కోలో ఆగడానికి మాత్రమే రష్యా అనుమతిస్తుందని తెలియపరచారు. బోసుపట్ల, సోవియట్లకు నమ్మకం లేదు. బ్రిటీష్‌వారు తమకూ ఆఫ్ఘనీస్తాన్‌కూ తగాదా పెట్టటానికి ఒక పన్నాగంగా బోసును ప్రయోగిస్తున్నారని రష్యా అనుమానం.

కాబూల్‌లో వుండగా, జర్మన్ మంత్రి హన్యా పిల్జర్ మాత్రం బోసుపట్ల అతి జాగ్రత్తగా వ్యవహరించారు. ఇందుకు భిన్నంగా ఇటలీకి చెందిన ప్రియతో ఖురాని మాత్రం బోసుతో సన్నిహితంగా వున్నారు. బోసు తన ఆలోచనను ఖురానీకి వివరించారు. జర్మనీ, ఇటలీ సైన్యాలు 50 వేలు గనుక భారత సరిహద్దులకు చేరితే, ఇండియాలో సైన్యం అంతా బ్రిటిష్ పాలకులను వదలి వస్తుందని, జనం అంతా తిరగబడతారనీ బోసు అన్నాడు. ఇండియాలో రాజకీయ జోస్యం చెప్పే నాయకునిగా తనకు గుర్తింపు వున్నదనీ, అంతర్జాతీయ సంఘటనలు తనవలె గ్రహించగలిగే వారెవరూ ఇండియాలో లేరనీ, తన మాటపై భారతీయులకు పరిపూర్ణ విశ్వాసం వుందనీ, ఖురానీతో బోసు నొక్కి వక్కాణించాడు. రేడియోలో తాను ప్రసారాలు ప్రారంభిస్తే యావత్తు సైన్యం బ్రిటిష్ వారిని వదిలి వచ్చేస్తుందన్నారు. ఇటలీ, జర్మనీలు కలసి ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటించాలన్నారు. కాని ఇండియాలో ఎర్రరిజం విద్రోహచర్యలు భారీ ఎత్తున చేయమని బోసును కోరాడు ఖురానీ.

1941 మార్చి మొదటి వారంలో బోసు కాబూలులో వున్నట్లు ఇండియాలో బ్రిటిష్ పాలకులకు తెలసింది. కాబూలులో వున్న బ్రిటిష్ మంత్రికి ఇండియా పాలకులు వ్రాస్తూ బోసు కార్యకలాపాలకు అడ్డు రావద్దనీ, బోసును శత్రు రాజ్యాలకు వెళ్లనివ్వడంలో కూడా పెట్టుద్దన్నారు. దేశంలో బోసును ఒక రాజకీయ నాయకుడిగా దెబ్బ తీయాలని బ్రిటిష్ పాలకుల తలంపు.

బోసును ఇరాన్‌మీదుగా తీసుకెళ్ళటానికి ఇటలీ చర్యలు తీసుకున్నది. కాని యీ ప్రయత్నం మానమని మార్చి 17న పిల్జర్ తంతి యిచ్చాడు. మార్చి 18న సినార్ ఆరెండో మజోటా అనే పేరుతో ఇటలీ పాస్ పోర్టు (రిజిస్టర్ నంబరు 64932) కాబూలునుంచి బోసు మాస్కోకు బయలు దేరారు. మాస్కోలో

బోసుకు ఆతిథ్యం అతిగా లభించింది. కాని ఆయన ఎంత ప్రయత్నించినా రాజకీయ నాయకులెవరూ కలియలేదు. రష్యాపై కొండంత ఆశ పెట్టుకున్న బోసుకు నిరుత్సాహం ఎదురైంది. మార్చి 31న మాస్కోనుంచి బోసు రైలులో బెర్లిన్ వెళ్లినట్లు షులెన్‌బర్గ్ తంతి యిచ్చాడు.

1941 ఏప్రిల్ 2న బోసు బెర్లిన్ చేరుకున్నాడు. అప్పటికే జర్మనీ పట్ల హిట్లర్ పట్ల బోసుకూ పరస్పర విరుద్ధ భిప్రాయాలు ఉన్నవి.

హిట్లర్ పట్ల విరుద్ధ వైఖరులు

1939 అక్టోబరు 12 ఢిల్లీలో మాట్లాడుతూ బోసు హిట్లర్ జాతికి మార్గాంతరం సోషలిజమనీ కాంగ్రెస్‌లోగాని బయటగాని హిట్లరిజాన్ని తాను వ్యతిరేకిస్తాననీ అన్నారు. ఈ మాటలు పలికిన ఆరు నెలల్లో బోసు ఫ్రాస్తూ, జర్మనీ ఫాసిస్టు కావచ్చు, సామ్రాజ్యవాది కావచ్చు, క్రూరంగా విచక్షణా రహితంగా ప్రవర్తించవచ్చు. నాజీ జాత్యహంకారాన్ని బోసు నిరసించినా అది అణచుకొని వారిని అభినందించే స్థితికి వెళ్లాడు. నాజీ సోవియట్ ఒడంబడిక వలన బ్రిటన్ ఓటమి ఖాయమని బోసు ఆశించాడు.

బెర్లిన్ వెళ్లిన మరునాడే విదేశీ కార్యాలయంలో అండర్ సెక్రటరీ డా. నోర్మన్‌ను బోసు కలుసుకొన్నాడు. బ్రిటిష్ వారి బలహీనతలు, ఇండియా బలాన్ని గురించి హోర్మన్‌కు ఒక పత్రం సమర్పించాడు. బోసు సాహసయాత్ర బెర్లిన్‌లో వుండటాన్ని రహస్యంగా అట్టి పెట్టాలని హోర్మన్ చెప్పినా, బోసు పథకంపై ఏమీ మాట యివ్వలేదు.

జర్మనీ-ఇటలీలకూ ఇండియాకు మధ్య సహకార పథకాన్ని 1941 ఏప్రిల్ 9న బోసు సమర్పించాడు. దీనికి గాను భారత స్వాతంత్ర్యాన్ని ప్రకటించాలన్నాడు. యుద్ధం ముగిసే వరకూ ఐరోపాలో స్వేచ్ఛా భారత కార్యాలయం స్థాపించి, దానికి రాయబారుల్ని నియమించే పెత్తనం, ఒడంబడికలు చేసుకునే హక్కు, తగిన ఆర్థిక బలం యివ్వాలన్నాడు. రేడియో ద్వారా ఇండియాలో ప్రసారాలు జరగాలి. కాబూల్‌లో గూఢచారి కేంద్రం స్థాపించాలి. బ్రిటిష్ సైన్యాల్ని ఎదుర్కొని, దాడి జరపడానికి కొండ జాతుల వారికి శిక్షణ యివ్వాలి. ఇండియాలో ప్రసారాలు జరగాలి. కాబూల్‌లో గూఢచారి కేంద్రం స్థాపించాలి. బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కొని, దాడి జరపటానికి కొండ జాతుల వారికి శిక్షణ యివ్వాలి. ఇండియాలో రైలు పట్టాలు సీకటం, ఫ్యాక్టరీలు కూలగొట్టడం వంటి విద్రోహచర్యలు విరివిగా జరగాలి.

స్వేచ్ఛా భారత ప్రభుత్వానికి రుణంగా డబ్బు సమకూర్చిస్తే, ఉత్తరోత్తరా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ ఋణాన్ని తీరుస్తామని బోసు కోరాడు. జపాన్-రష్యా ఒడంబడిక కావాలన్నారు. ఇండియాలో బ్రిటిష్ సైన్యం 70 వేలు కాగా యావత్తు సైన్యం, పోలీసు కలసి 2,50,000 అన్నారు. ఇండియాలో బ్రిటిష్ వారి పట్ల సానుభూతి లేదు గనుక 50వేల సైన్యంతో అంతా విచ్ఛిన్నం చేయవచ్చునని జర్మన్‌కు నచ్చజెప్పటానికి బోసు ప్రయత్నించాడు. ఇండియాలో విప్లవానికి అనుకూల వాతావరణం వున్నదనీ, దీనిని వినియోగించుకోవటమే తరువాయి అని బోసు పేర్కొన్నాడు. జర్మనీ, జపాన్‌లు మరో దెబ్బకొడితే, అటువైపు జపాన్ గనుక సింగపూర్‌ను కొడితే, బ్రిటిష్ ప్రతిష్ఠ మంట గలుస్తుందని బోసు తన నివేదికలో చెప్పారు. దేశంలోని సైన్యం సిక్కులు తిరుగుబాటు చేసిన ఉదంతాల్ని బోసు ఉదహరించారు.

జర్మన్ ప్రభుత్వానికి బోసు తన నివేదిక సమర్పించాడు. హిట్లర్ అనుమతి స్తేనే స్వేచ్ఛా భారత ప్రభుత్వ స్థాపన సాధ్యం. అందుకు ఆయన సిద్ధంగా లేడు. లండన్‌లో అనేక ప్రవాస ప్రభుత్వాలు న్నట్లే, స్వాతంత్ర్యాన్ని కోరే చిన్న దేశాల్ని జర్మనీ ప్రోత్సాహించాలని బోసు వాదించాడు. బెర్లిన్‌లో ఇలాంటి ప్రభుత్వాల స్థాపనకు ముఖ్యంగా యూరప్ వెలుపలగల దేశాల పక్షాన కార్యాలయాలు స్థాపించటానికి హిట్లర్ సుతారమూ అంగీకరించలేదు. ఏతావాతా బోసు నివేదిక అనంతరం జరిగిందేమంటే ఆయనకు వ్యక్తిగత ఖర్చుల క్రింద 12 వేల మార్కులు, ఇండియా నుద్దేశించి ప్రచార తదితర కార్యకలాపాల నిమిత్తం 10 లక్షల మార్కులు కేటాయించారు. 1941 మేలో ఈమేరకు సాధించామన్న మాట. బోసు నాయకత్వాన స్వేచ్ఛా ప్రభుత్వాన్ని బెర్లిన్ స్థాపిస్తే, ఇండియాలో ఇతర రాజకీయ పక్షాలను దూరం చేసుకొన్నట్లవుతుందని హోర్‌మన్ భావించారు. గాంధి, నెహ్రూ వంటి నాయకులు లేకుండా దేశంలో చాలా మంది ప్రజలు అసమ్మతి తెలుపు తారన్నాడు.

కాబూల్ నుండి మాస్కో వరకు బోసు వెంట వెళ్లిన నెంజర్ అనే ఇంజనీరుకు, దాస్‌మన్ అనే వ్యక్తికీ కేటాయించిన 10 లక్షల మార్కులలో కొంతయిచ్చి మాస్కో మీదుగా కాబూలు పంపాడు. డోవ్ అనే రేడియో ఆపరేటర్‌కు మరి కొంత నిధియిచ్చి పంపారు.

అంతవరకూ తామే అధికులమనే జర్మన్లను బోసు తనతో సమానంగా పరిగణించటమే గాక, జర్మనీ సహాయపడకపోతే భారత సరిహద్దులకు వెళ్లి పోరాటం కొనసాగిస్తానని స్పష్టపరిచారు. అయితే బోసు కోరిన వాటిల్లో చాలావాటిని జర్మన్లు ఒప్పుకోలేదు. ముఖ్యంగా ఇండియాను స్వతంత్ర దేశంగా ప్రకటించటానికి అసలే మొగ్గు చూపలేదు.

బెర్లిన్‌లోనూ రహస్య జీవితమే

బెర్లిన్ రహస్య జీవితం గడుపుతున్న సుభాష్ చంద్రబోసు ఒక హోటల్లో వుండేవారు. జర్మన్ నాజీ ప్రభుత్వ విదేశాంగమంత్రి రిబ్బెన్‌ట్రూప్ మొదటి పర్యాయం 1941 ఏప్రిల్ 29న వియన్నాలోని ఇంపీరియల్ హోటల్‌లో బోసుతో సమావేశమయ్యారు. వారి చర్చల సారాంశాన్ని షిమిట్ వ్రాసుకున్నారు. బోసు తన వాదనను పునరుద్ఘాటిస్తూ కేవలం 70 వేల మంది బ్రిటిష్ సైన్యాన్ని ఓడించడం కష్టంకాదనీ, భారత ప్రజా విశ్వాసాన్ని పొందడానికి వీలుగా ఇండియాకు స్వాతంత్ర్యం యిస్తామని ప్రకటించాలన్నారు. రాజీలకు లొంగిపోతాడని గాంధీని తృణీకరించే బోసు వాదనకు రిబ్బెన్‌ట్రూప్ అంగీకరించక, గాంధీని కలుపుకోకపోతే, బ్రిటీష్‌వారు బోసుకు వ్యతిరేకంగా గాంధీని పెడతారన్నారు. రిబ్బెన్‌ట్రూప్ ప్రశ్నలకు బోసు సమాధానం యిస్తూ, ఇండియాలో జాతీయ సోషలిజం పేరిట ఫాసిజానికి వ్యతిరేకత వున్నదనీ, అయితే జర్మనీ, రష్యా ఒడంబడిక అనంతరం ప్రజల వుద్దేశ్యాలు మారాయని అన్నారు. సోవియట్ యూనియన్ సామ్రాజ్యవాదన వ్యతిరేకత కనబరచినందున ప్రజలలో ఆ దేశంపట్ల అనుకూలత పెరిగిందని అయితే చైనాపై దురాక్రమణ చేసిందనే కోపం జపాన్‌పై వున్నదనీ రిబ్బెన్‌ట్రూప్‌కు తెలియజేశారు. జర్మనీ-బ్రిటన్ పొత్తు పెట్టుకొంటే, యుద్ధంలో బ్రిటన్ ఓటమికి గురికాక పోవచ్చనే భారత ప్రజల భయాందోళనల్ని బోసు వ్యక్తం చేశారు. జపాన్-చైనాల సంఘర్షణ త్వరగా పరిష్కారమై, సింగపూర్ మీదకు జపాన్ వస్తే,

భారతీయులు ఆహ్వానిస్తారన్నారు.

బెర్లిన్ నుండి హిందీలోచేసే ప్రసారాలను భారతీయులు శ్రద్ధగా వింటున్నారని రిబ్బెన్‌ట్రూప్‌కు బోసు నచ్చజెప్పాడు. భారత విమోచనోద్యమానికిగాను జర్మనీ, ఇటలీ చేతుల్లో బందీలుగా వున్న భారతీయ సైన్యాలను వినియోగించుకో వచ్చునని బోసు ప్రప్రథమంగా విదేశాంగ మంత్రికి సూచించారు. అయితే రిబ్బన్‌ట్రూప్ ఈ విషయమై ఎలాంటి మాట యివ్వలేదు. అయితే రెండవ ప్రపంచ యుద్ధంలోనే ఇండియాకు స్వాతంత్ర్యం రావచ్చునని మాత్రం **సూచాయగా** ఆయన అన్నారు. సరైన సమయంలో హిట్లర్ జోక్యం చేసుకొంటారని తప్ప, మరే విధమైన హామీని బోసు రాబట్టలేక, మరోసారి నిరాశ చెందారు.

బోసు విజ్ఞప్తులు

లోగడ జర్మనీ ప్రభుత్వానికి అందిన నివేదికకు అనుబంధంగా 1941 మే 3, 4 తేదీలలో వోర్‌మన్‌కు మరో నివేదికను సుభాష్ బోసు అందించారు. ఇండియా స్వాతంత్ర్యం వెంటనే ప్రకటించాలనే విషయంపై బోసు మరోసారి చెప్పారు. బాల్కన్ దేశాలలో ఉత్తర ఆఫ్రికాలో విజయ పరంపరల దృష్ట్యా, జర్మనీ, ఇటలీలు వెంటనే ఆఫ్ఘనిస్తాన్‌లో వెంటనే బ్రిటిష్ అనుకూల ప్రభుత్వాన్ని కూలద్రోసి, ఇరాక్ సైనిక సహాయం చేయాలన్నారు. టర్కీ, రష్యాలపై దాడిచేస్తే ఇండియాలో ప్రజల సానుభూతి కోల్పోతారని దానికి బదులు బ్రిటిష్ సామ్రాజ్యంపై దాడి జరపాలని కోరారు.

బోసు సూచనలకు భిన్నంగా అప్పటికే రష్యాపై దాడికి హిట్లర్ నిర్ణయం తీసుకున్నారు. 1941 మే 10న వోర్మన్ చెబుతూ, ఎనిమిది లేక పది రోజుల్లో స్వేచ్ఛా భారత ప్రకటన హిట్లర్ విడుదల చేస్తారని, బోసును మరోసారి విదేశాంగ మంత్రి కలుస్తారన్నాడు. రేడియో ప్రసారాలు ముమ్మరం చేశారు.

బోసును ప్రప్రథమంగా కలిసిన అనంతరం, జర్మనీనుండి ఇండియాకు ప్రసారాల విషయమై విదేశాంగ మంత్రి ఆరాతీశారు. బోసు కోరికపై 100 కిలోవాట్ల, ట్రాన్స్ మీటర్‌ను హుజెన్ వద్ద డచ్ స్టేషన్‌గా స్థాపించారు. హిందీ, బెంగాలి, తెలుగు, తమిళంలో ప్రసారాలు ప్రారంభించారు. ఇటలీలో రేడియో హిమాలయ స్థాపించి, అది ఇండియాలోనే పని చేస్తున్నట్లు భ్రమ కల్పించారు. జర్మనీతో పోల్చితే ఇటలీ రేడియో ప్రసారాలు జయప్రదమైనవి. మహమ్మద్ ఇక్బాల్ పెత్రై దీనికి ఆధ్వర్యం వహించారు. ఇతడు భారతీయ ముస్లిం. బోసుకు, యితడికి మధ్య పచ్చగడ్డి భగ్గుమనేది.

స్వేచ్ఛా భారత ప్రకటన-జర్మన్ నిరాకరణ

స్వేచ్ఛా భారత ప్రకటన ప్రసారం చేస్తే ప్రపంచ రాజకీయాలలో చారిత్రక సంఘటన అవుతుందని బోసు ఉద్దేశ్యం. దీనికి గాను ఆయన ఒక వివరమైన పథకం సిద్ధం చేశారు. రానురాను ఐరోపాలో స్వేచ్ఛా భారత ప్రభుత్వ ఏర్పాటు ప్రతి

పాదనను బోసు ఉపసంహరించుకొన్నారు. దీని స్తానే స్వేచ్ఛా భారత దళాన్ని ఏర్పరచాలన్నారు. యుద్ధ ఖైదీల ఆధారంగా ఈ దళం ఏర్పరచి తరువాత వారిని ఇండియా విమోచనకు పంపాలి.

ఇండియాలో విప్లవానికిగాను, సరిహద్దు కొండ ప్రాంతాలలో సైనిక స్థావరం కూడా నిర్మించాలి. రష్యా, జర్మనీ అంగీకారానికి వస్తేనే ఇండియా బాగుంటుందని బోసు వాంఛను మరోసారి వెల్లడించారు. అదీ వీలుగాకుంటే ఇరాన్ ద్వారా మార్గం ఏర్పరచాలన్నారు.

స్వేచ్ఛా భారత ప్రకటనను బోసు రూపొందించారు. భారత ప్రజల సంపూర్ణ స్వాతంత్ర్యహక్కును జర్మనీ, ఇటలీ గుర్తిస్తున్నాయని యిందలి సారాంశం. ఎందుకోగాని జపాన్ పేరులేదు. భారత ప్రజలు తమకు కావలసిన ప్రభుత్వాన్ని ఏర్పరచుకుంటారు. జాతీయ రాజ్యాంగాన్ని పొందుపరచుకొంటారు. ఇలాంటి ప్రకటనకు రెండు దేశాలు అంగీకరిస్తాయనే ఆశతో కాబూల్‌లోని **రహమత్** ఖాన్ ద్వారా భారతీయులకు బోసు తన సందేశాన్ని పంపారు. ఈ ప్రకటన వెలువడగానే తాను **ప్రచారానికీ,** ప్రసారాలకు నాంది పలుకుతాననీ, పార్టీలతో నిమిత్తం లేకుండా భారత ప్రజలు స్నేహ రాజ్యాల సహాయంతో స్వేచ్ఛకు పోరాడాలన్నారు. కాని సందేశం చేరకముందే రష్యాపై జర్మనీ దాడి జరగటంతో, బోసు సందేశానికి కాల దోషం పట్టింది.

భారత స్వాతంత్ర్య ప్రకటన కొన్నాళ్లపాటు వాయిదా వేయాలని విదేశాంగ మంత్రి రిబ్బెన్ ట్రూప్ 1941 మే 24న బోసుకు చెప్పారు. ఆ కొన్నాళ్లనేది ఎన్నేళ్లకూ జరగలేదు.

రష్యాపై జర్మనీ దాడికి కొద్ది రోజుల ముందు విదేశాంగ సమాచార విభాగంలో పనిచేసే ఫ్రాంజు జోసెఫ్ ఫర్ట్ వాంగర్ ప్రప్రథమంగా బోసును కలిశారు. నాజీ అధికారులు అడుగడుగునా బోసును అనేక విధాలుగా అవమానాలపాలు చేశారని ఆయన వ్రాశాడు.

కాంగ్రెస్‌లో **విభేదాలు** ప్రక్కకు బెట్టి, హిట్లర్‌ను ఆశ్రయించటం మాని స్వాతంత్ర్యం కోసం పని చేయమని ఫ్రాంజు సలహా చెప్పేసరికి, బోసు ఖంగు తిన్నాడు. అప్పటినుంచీ బోసుకు జర్మనీలో ఎవరన్నా అనుమానంగా వుండేది. మనిషి కుంచించుక పోయాడు.

బోసుపై గూఢచారులు

ముస్సోలినీ యిటలీ నుంచి బోసుకు ఆహ్వానం పంపారు. హిట్లర్ కంటే ముందు ముస్సోలినీని కలిస్తే, ప్రతిష్ఠ దెబ్బతింటుందేమోనని జర్మన్ అధికారులు తటపటాయించారు. అదిగాక ఇటలీలో రహస్యాలు దాగవు. అయినా 1941 మే 29న విమానంలో బోసు ఇటలీ వెళ్లి, జూన్ 6న ఒకసారి జూన్ 26న మరోసారి విదేశాంగ మంత్రి కౌంట్ సియోనోను కలిసాడు. సియానో దృష్టికి బోసు ఆనలేదు. హఠాత్తుగా పైకి వచ్చిన వ్యక్తిగా భావించాడు. 10 రోజుల అనంతరం సియానో వెళ్లి రబ్బన్‌ట్రూప్‌ను కలియగా భారత స్వాతంత్ర్యం విషయమై మాట **యివ్వజాలననే** హిట్లర్ అప్పటి వరకూ బోసును కలుసుకోలేదని, కనుక ఇటలీతొందరపడరాదని సలహాయిచ్చాడు. బెర్లిన్ కంటే రోమ్‌లో బోసు స్వేచ్ఛగా మెలిగాడు. అక్కడ మిస్ ఎమిలీ షెకెల్‌తో కలిసి వున్నాడు. ఆమెను బోసుపై గూఢాచారిగా **ప్రయోగించాలా** అని రోమ్ రాయబారి కార్యాలయం బెర్లిన్‌ను అడిగింది. అలాంటి పనిచేయవద్దని బెర్లిన్ స్పష్టం చేసింది. ఇటలీ వారికి బోసు బాగా నచ్చజెప్ప గలిగాడు. రష్యాపై జర్మనీ

దాడి వలన రోమ్‌లో వుండి పోయిన బోసుకు తన కళ్లెదుట కట్టుకున్న స్వాతంత్ర్య సౌధ్యం కూలిపోయినట్లయింది.

నాజీల అసలు రంగు

రష్యాపై జర్మనీ దాడి బోసును దిగ్భ్రాంతి పరచింది. అప్పుడు రోమ్‌లో వున్న సుభాష్ చంద్రబోసు తన నిస్పృహను వ్యక్తపరుస్తూ వోర్‌మన్‌కు ఉత్తరం వ్రాశాడు. బెర్లిన్‌కు వచ్చినందు వలన ప్రయోజనం లేదనీ, ఇండియా ప్రజాభిప్రాయం జర్మనీకి వ్యతిరేకంగా వున్నదనీ తెలియపరచాడు. బహుశా బోసు యిక ముందు ఉదాసీనంగా వుండొచ్చునని వోర్‌మన్ భావించాడు. కాని 1941 జూలై 14న బోసు బెర్లిన్‌కు వచ్చి, మూడు రోజులలోనే వోర్‌ను కలిశాడు.

ఇండియావైపుకు జర్మనీ సైన్యాలు వెడితే, బ్రిటిష్ వారి స్థానే జర్మన్‌లు పరిపాలిస్తారనే భావం భారతీయులలో ప్రబలిందనీ, రష్యాపై దాడి వలన జర్మనీని దురాక్రమణ దారుగా భావిస్తున్నారని బోసు తెలియపరచాడు. యూరప్‌లో స్వేచ్ఛా భారత కేంద్ర స్థాపన అంత ముఖ్యం కాదనీ, ముందు ఇండియాకు స్వాతంత్ర్యం యివ్వాలనే ప్రకటన అవసరమని బోసు నొక్కి చెప్పాడు.

వోర్‌మన్ సమాధానమిస్తూ సమయం కాదని మళ్ళీ దాటవేశాడు. రష్యాపై దాడి చేయకముందే బోసును స్విట్జర్లాండ్ పంపించివేసి స్వేచ్ఛా భారత కేంద్రాలు స్థాపించుకొందామని జర్మన్‌లు భావించారు. రోమ్‌లో జర్మనీ రాయబార కార్యాలయం కూడా బోసును తటస్థ భారత ప్రకటన చేయనిదే, ప్రసారాలలో పాల్గొనడానికి బోసు నిరాకరించాడు. కాని స్విట్జర్లాండ్ అధికారులు అలాంటి కార్య కలాపాలకు అంగీకరించ లేదు.

భారత దేశాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించనందుకు నిరసనగా 1941 ఆగష్టు 15న జర్మన్ విదేశాంగ మంత్రి రిబన్‌ట్రూప్‌కు బోసు ఒక లేఖ వ్రాస్తూ జర్మన్ సైన్యాలు తూర్పు దిశగా వెడుతుంటే, శత్రువులు వస్తున్నట్లు భావిస్తున్నారని, ఇండియాలో ఈ భావన యింకా స్పష్టంగా వున్నదని, కనుక స్వేచ్ఛా భారతావని ప్రకటన వెలువడాలని అన్నారు.

బోసు కోరిన ప్రకటన అవసరమని వోర్‌మన్ భావిస్తూ రిబ్బన్ ట్రూప్‌కు సిఫారసు చేశారు. బోసును శాంతింపజేసే ప్రయత్నాలు ప్రారంభించాలా అని కూడా వోర్‌మన్ సలహా అడిగితే, రిబ్బన్‌ట్రూప్ నిరాకరించాడు. ప్రతి నిర్ణయం కూడా హిట్లర్‌పై ఆధారపడి వుందనీ, కనుక వేచి వుండమని బోసుకు వోర్‌మన్ సలహా చెప్పాడు.

1941 ఆగష్టు 11న విదేశాంగ కార్యాలయంలో ఒక సమావేశానికి బోసును ఆహ్వానించారు. ఆఫ్ఘనిస్తాన్‌లోను, ఉత్తర సరిహద్దులలో విద్రోహ చర్యలగురించి చర్చించారు. జర్మన్, ఇటలీలు ఎన్నాళ్లున్నా, ఇండియా విమోచన గురించి మాట్లాడక పోవటంలో బ్రిటిష్‌వారు ఆ విషయమై చక్కగా అనుకూల ప్రచారం చేసుకొన్నారని బోసు చెప్పాడు. ఆగష్టు 25న ఇరాన్‌పై దాడి జరిగినప్పుడు వెజు సావర్ ఒక సూచన చేస్తూ ఇండియా విమోచన ప్రకటనకు యిదే తరుణం అన్నప్పటికీ విదేశాంగ మంత్రి రిబ్బెన్ ట్రూప్ మాట్లాడలేదు.

బెర్లిన్ స్వేచ్ఛా భారత కేంద్ర స్థాపన నిమిత్తం యూరప్‌లో వున్న భారతీయుల్ని చేర్చడానికి బోసు ప్రకటించాడు. బెర్లిన్‌లో 40 మంది మాత్రమే భారతీయులున్నారు. బెల్జియం, హాలెండ్, ఫ్రాన్స్‌లు సందర్శించాడు. ఎ.సి.ఎన్.

నంబియార్‌ను కోరగా లోగడ జర్మన్‌లు తనను జైళ్ళలో పెట్టి నరకయాతనల దృష్ట్యా అతడు రానన్నాడు. కాని బోసు నచ్చజెప్పి బెర్లిన్‌కు తీసుకొచ్చాడు. బోసు జపాన్ వెళ్ళిన తరువాత యితడే కేంద్రానికి ఆధిపత్యం వహించారు. గిరిజా కె. ముఖర్జీ కూడా తరువాత వచ్చి చేరాడు.

1941 సెప్టెంబరు 10న వోర్‌మన్ మళ్లీ బోసును కలసి స్వేచ్ఛా భారత ప్రకటన వాయిదా వేస్తున్నట్లు చెప్పాడు.

బెర్లిన్‌లో భారతకేంద్రం

బెర్లిన్‌లో స్వేచ్ఛా భారత కేంద్రం బోసు, మజోటాల ఆధ్వర్యాన ఆరంభమైంది. 1941 డిసెంబరులో ఒక ప్రణాళికా సంఘాన్ని కూడా ఏర్పరచారు. ఆజాద్ హింద్ రేడియో పేరిట ప్రసారాలపై కేంద్రీకరించడం ఈ కేంద్ర కార్యక్రమం.

ఉత్తర ఆఫ్రికాలో యున్న భారతీయ సైనిక ఖైదీలు ఇటలీ అధీనంలో వున్నారు. ఇటలీ వారు ముందే భారత కేంద్రాన్ని స్థాపించారు. పంజాబ్ ముస్లిం మహమ్మద్ ఇక్బాల్ షెదాయ్ భారత సమస్యల్ని చూస్తుండేవారు. ఇతడు 1920లో ఎం.యన్. రాయ్‌తోబాటు మాస్కోలో వున్నాడు. ఇటలీలో యితడి పరిస్థితి మెరుగుగా వుండేది. ప్రతిరోజు రేడియో హిమాలయ ద్వారా ఇటలీ నుండి షెదాయ్ ప్రసారాలు చేస్తుండేవాడు. ఇతడొక పథకాన్ని సూచిస్తూ, జర్మనీ ఇటలీలతో పాటు ఇతర దేశాలను కూడా కలుపుకొని ఒక సంఘాన్ని ఏర్పరచాలన్నాడు.

బోసు రోమ్‌లో మహమ్మద్ షెదాయ్‌ను కలిశారు. ఇరువురూ 1941 ఆగష్టులో పారిస్ వెళ్ళారు. కాని పరస్పరం ద్వేషించుకొన్నారు. తొలి చూపుల్లోనే యీ ఈర్ష్యా ద్వేషాలు వెల్లడయ్యాయి. షెదాయ్ పాకిస్తాన్ కావాలనేవాడు. బోసు సెక్యులర్‌గానే వుండాలనే వాడు. రాజకీయం గానూ, వ్యక్తిగత అలవాట్లలోనూ యిరువురికీ తీవ్రమైన తేడాలున్నవి.

భారతీయ యుద్ధ ఖైదీలలో 1300 మందిని డ్రెస్డన్‌లోని అనాబర్గ్ కేంపుకు తరలించారు. షెరాయ్ వారిని సందర్శించాలని, వారికిచ్చే ఆహారం బాగా లేదనీ, కులపరమైన అలవాట్లు విచక్షణ వున్నాదనీ జర్మన్ అధికార్లకు వ్రాశాడు. ఇండియన్ ఆఫీసర్లను, నాన్ కమీషన్డ్ ఆఫీసర్లను సోర్జర్లతో కలిపేసరికి వారిలో నైతికస్థాయి దెబ్బతిన్నదన్నాడు. బ్రిటిష్ వారి ఆధిపత్యాన వుండటానికే యిష్టపడుతున్నారన్నారు. బోసుకూ, షెదాయ్‌కూ సైనికుల విషయమై తీవ్రమైన భేదాభిప్రాయాలున్నవి.

బెర్లిన్‌లో ఇండియా కేంద్ర కార్యకలాపాలలో బోసు పాల్గొనలేదు. అంత వరకూ హోటళ్ళలో వుంటున్న బోసుకు జర్మన్ ప్రభుత్వం విశాల భవనాన్ని యిచ్చింది. అక్కడ వుంటూ (సోఫిన్ స్టాప్, బెర్లిన్ చార్లటన్‌లతో) జరుగుతున్న సంఘటనల్ని బోసు పరిశీలించాడు. అక్టోబరు 30న కేంద్రం ఆరంభించగా, వెన్వెంటనే ఆజాద్ హింద్ రేడియో మొదలైంది.

బోసుపై నిఘా!

బోసు ఫోను సంభాషణలు ఒక పద్ధతిలో రహస్యంగా వినే ఏర్పాటు చేశారు. బోసు చికాకుపడ్డాడు. ఆయన భార్య ఎమిలితో మాట్లాడాలంటే ఇంటి బయటకు వెళ్లేవారు.

బోసు బెర్లిన్‌లో వుంటున్నట్లు సమాచారం బయటకు పొక్కింది. 1941 నవం

(తరువాయి వచ్చే సంచికలో)

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd. 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

Phone: 67148/66909.
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

AN ADVANCED

TECHNOLOGY

FOR AN IMPROVED

QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.
Regd off: 1-10/12, Ashoknagar, Hyderabad-500 020.